క్లుప్తంగా

హోరాహోరీగా క్రీడాపోటీలు


విలువిద్యలో పాల్గొన్న గిరిజన క్రీడాకారులు

బుట్టాయగూడెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలవరం నియోజకవర్గస్థాయిలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు సోమవారం నాడు కూడా హోరాహోరీగా సాగాయి. వాలీబాల్, కబడ్డీ పోటీలు, విలువిద్య పోటీలు ఎంతో రసవత్తరంగా జరిగాయి. ఎంపీపీ కారం శాంతిరమణ, తహసీల్దార్ ఎస్. శారాశాంతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, సరియం లక్ష్మి, తెల్లం వెంకటలక్ష్మి, జీటీఎస్ రాజు, ఎంపీటీసీ తెల్లం రమణ, ఏపీ గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, తదితరులు ఈ ఆటల పోటీలను మూడో రోజు ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. కాగా విలువిద్యలో 125 మంది పోటీపడగా, వాలీబాల్‌లో 64 టీమ్‌లు, కబడ్డీలో 18 టీమ్‌లు పాల్గొన్నాయి. మరో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ ఆటల పోటీల్లో 7 మండలాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

విర్డ్‌లో ఓపీ సేవలు ప్రారంభం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో జనరల్ ఓపీ సేవలు సోమవారం ప్రారంభమయ్యాయి. రోగులకు వైద్య సేవలు అందించేందుకు ముందుగా ఆస్పత్రికి విచ్చేసిన ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్యులకు విర్డ్ ట్రస్టు సభ్యులు సుధాకరరావు, చెలికాని రాజబాబు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పూల బొకేలను అందించారు. వైద్యులు జనరల్, చిన్నపిల్లలు, ఊపిరితిత్తులు, చర్మవ్యాధులకు సంబంధించిన వైద్య సేవలను రోగులకు అందించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సేవలను అందిస్తామని, రోగులు గమనించాలని వైద్యులు కోరారు.

ఎమ్మెల్యే ఎలీజా పరామర్శ

లింగపాలెం : పుప్పాలవారిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఏపూరి సూరిబాబు భార్య ఛాయదేవి(65) నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, వైఎస్సార్ సీపీ నాయకులు సూరిబాబును పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్లు మండలపు సాయిబాబా, జగ్గవరపు ముత్తారెడ్డి, పార్టీ నేత కోటగిరి పాపారావు తదితరులు సూరిబాబును పరామర్శించారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ విషయాన్ని వెల్లడిస్తున్న సీఐ కే వీ సత్యనారాయణ

కుక్కునూరు : మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కుక్కునూరు సీఐ కే వీ సత్యనారాయణ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన ఓబినేని చంద్రశేఖర్ అలియాస్ శేఖర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో మహిళ నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తగిన ఆధారాలు సేకరించి నిందితుడిని ఆదివారం తన నివాసంలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

ఇంటి యజమానిపై భార్యాభర్తల దాడి

ద్వారకాతిరుమల : ఇంటి యజమానిపై దాడిచేసిన భార్యాభర్తలపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని తిమ్మాపురానికి చెందిన వాసిరెడ్డి సోమశేఖర్ తన ఇంటి పక్కనే ఉన్న మరో ఇంటిని బంధువులైన పర్వతనేని హరి వెంకట యుగంధర్ బలరామరెడ్డి, గీత దంపతులకు 15 ఏళ్ల క్రితం అద్దెకిచ్చాడు. రెండేళ్లుగా వారు సోమశేఖర్‌కు అద్దె చెల్లించడం లేదు. ప్రస్తుతం ఇంటి గొడవకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉంటే ఈనెల 21వ తేదీ సాయంత్రం బలరామరెడ్డి ఇంటి గేటుకు వెల్డింగ్ చేయించడం, గోడ కట్టడం వంటి పనులు చేయిస్తున్నాడు. ఆ సమయంలో సోమశేఖర్ వాటిని వీడియో తీస్తుండగా బలరామరెడ్డి, అతని భార్య గీత సోమశేఖర్‌పై గొడవకుదిగి అతడ్ని తిట్టి, కొట్టి, చంపడానికి ప్రయత్నించారు. బాధితుడు కవుకు దెబ్బలతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి, చికిత్స పొందాడు. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- బాదరాలలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

లింగపాలెం : అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేసి, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం బాదరాలలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే ఎలీజా, స్థానిక సీనియర్ నాయకులు బొల్లిన సుబ్బారావు పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నారా అన్న విషయాలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. దాదాపు ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకం రూపంలో నవరత్నాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఒకొక్క ఇంటిలో రూ 1.5 లక్షల నుంచి 3.75 లక్షల వరకు పథకాల ద్వార లబ్ధిదారులు లబ్ధిపొందుతున్నారన్నారు. ఒకే ఒక్క చాన్స్ ఇవ్వండంటూ టీడీపీ నాయకులు మీవద్దకొస్తే నమొద్దన్నారు. ప్రజల కష్టాల్ని అర్థం చేసుకునే చిప్ చంద్రబాబుకు లేదని విమర్శించారు. ప్రజలపై ఆయనకు మమకారం, ప్రేమ ఏమాత్రం లేవని,


బాదరాలలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

పేదలు ఎదగకూడదన్నదే చంద్రబాబు, దుష్టచతుష్టయం విధానమని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబా, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ధర్మాజీగూడెం, రంగాపురం సొసైటీ చైర్‌పర్సన్‌లు ఉప్పలపాటి వరప్రసాద్, ఎం.లోక్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు బి సుబ్బారావు, రావికొండయ్య, ఎం.నరసింహరావు, కె.పాపారావు, రెడ్డిన శ్రీను, కర్లపూడి ఆనంద్, సుద్దపల్లి రాంబ్రహ్మం పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- శ్రీరంగపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం : రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, వచ్చే జూన్‌లోగా గ్రామస్థాయి రోడ్లు మొదలుకొని జాతీయ స్థాయి రోడ్లను సైతం పూర్తిస్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. సోమవారం అచ్యుతాపురం పంచాయతీ శ్రీరంగపట్నంలో గ్రామ కన్వీనర్ ముమ్మిడి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి మొదలుకొని శ్రీరంగపట్నం వరకు రోడ్డు అభివృద్ధి గురించి స్పందిస్తూ ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందిగా పేర్కొన్నారు. గ్రామాలలో అధ్వానంగా ఉన్న రోడ్లపై ఫిర్యాదు అందితే 60 రోజులలోగా ప్రభుత్వం పరిష్కరించనుందని బాలరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు తెన్నులు, విధానాలు అడిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మాజీ సర్పంచులు ముమ్మిడి సత్యనారాయణ, మరపట్ల పాటియ్య


శ్రీరంగపట్నంలో ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండదండలు ఎప్పటికీ అందిస్తుందని వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ మద్దిపాటి నాగమణి, ఎంపీటీసీ మందపాటి కుమారి, హిస్టరీ కార్పొరేషన్ డైరెక్టర్ చిక్కాల మంగతాయారు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, గ్రామ కో-కన్వీనర్ కటూరి చంటిబాబు, మండల ప్రచార కన్వీనర్ తోర్లపాటి వాసు, నాయకులు గుడిచుట్ల సత్యనారాయణ, ముమ్మిడి శివ, మట్ట సత్తిబాబు, మందపాటి తాతారావు, వైఎస్ శ్రీనుబాబు, సీహెచ్ ద్రౌపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికీ సొంత ఇల్లు


రేచర్ల రెండవ మైలురాయి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం


పోలవరంలో ఇళ్ల పట్టాలను నిర్వాసితులకు అందజేస్తున్న తహసీల్దార్ బి.సుమతి

చింతలపూడి : ప్రతి పేదవానికి సొంత ఇల్లు సమకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని మండల పరిషత్ అధ్యక్షుడు డా బి.రాంబాబు నాయక్ అన్నారు. రేచర్ల రెండవ మైలురాయి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. రేచర్ల లేఅవుట్‌లో 66 ఇళ్ల స్థలాలకుగాను 35 స్థలాల్లో ఇళ్ళ నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు కడుతున్న ఇళ్ల నాణ్యతను లబ్ధిదారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.శివరామకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్లపట్టాలు అందజేత

పోలవరం రూరల్ : నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలను తహసీల్దార్ బి.సుమతి సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురైన టేకూరు, తూటికుంట, శివగిరి గ్రామాలకు చెందిన 25మంది నిర్వాసిత కుటుంబాలకు జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని చల్లవారిగూడెంలో నిర్మించిన గృహాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. 25 మంది గిరిజనేతరులు ఆయా ఇళ్లను పరిశీలించుకుని అంగీకరించిన మీదట పట్టాలను అందజేసినట్లు తహసీల్దార్ చెప్పారు.

ఖైదీలకు చట్టాలపై అవగాహన

చింతలపూడి : చింతలపూడి సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ సోమవారం సందర్శించారు. సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలను ఆహారం, వసతి, వైద్య సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేని నిందితులు, శిక్షలు పడి అప్పీలు చేసుకునే అవకాశం లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందచేస్తామని తెలిపారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం రమేష్, డేవిడ్ రాజు, అక్బర్ ఆలి, విజయరావు, సబ్ జైల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్

ఓటు హక్కు నమోదు తప్పనిసరి

జంగారెడ్డిగూడెం : అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కె.స్లీవజోజి విద్యార్థులకు సూచించారు. జనవరి 25వ తేదీన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం పట్టణంలోని ఆరు డిగ్రీ కళాశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన వ్యక్తిత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు భారత పౌరుని చేతిలో ఆయుధం వంటిదన్నారు. ఓటు హక్కు పొందడమే కాకుండా ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. పోటీలలో గెలుపొందిన వారికి జనవరి 25వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు, సామాజిక కార్యకర్త కేఎల్ఎస్.ధనకుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్లీవజోజి

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

కామవరపుకోట : స్థానిక చౌతన సెంటర్‌లోని శ్రీ సీతారామ స్వామి ఆలయం వద్ద వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సోమవారం నిర్వహించారు. వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, అభిషేకాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు శ్రీరామ చంద్ర వరప్రసాద్ అమ్మవారి చరిత్ర విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ జయవరపు లక్ష్మణ వరప్రసాద్, సెక్రెటరీ సమయమంతుల పూర్ణచంద్ర రావు, ట్రెజరర్ నంబూరి వరప్రసాద్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కమ్మంపాటి రత్నకుమారి, సెక్రెటరీ గుడిమెట్ల వెంకటలక్ష్మి, ట్రెజరర్ గుడిమెట్ల లీలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

టి.నరసాపురం : శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని బొర్రంపాలెంలో ఆర్యవైశ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో లయన్స్, వనిత లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సోమవారం టెంపుల్స్ సెంటర్లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించారు. అదేవిధంగా శ్రీ మీనాక్షి సుందరేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని అర్చకులు మామిళ్ళపల్లి త్రిపుర సుందర కుమార్ ఆధ్వర్యంలో భక్తులు అభిషేక, అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెంలో వృద్ధుని కథ సుఖాంతం

- మతిస్థిమితం లేక ఐదేళ్ల క్రితం కాకినాడ నుంచి వచ్చేసిన రామారావు
- ఇన్నాళ్లకు గుర్తుపట్టి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు

జంగారెడ్డిగూడెం : మతి స్థిమితం లేక అనాథగా రోడ్లపై జీవిస్తున్న ఓ వృద్ధుడి కథ సుఖాంతమైంది. చాలా కాలంగా కనిపించకుండా పోయిన ఆ వృద్ధుడిని కుటుంబ సభ్యులు గుర్తుపట్టి తమతో పాటు తీసుకువెళ్లారు. వివరాల్లోకి వెళ్తే వృద్ధుడు కోరుకొండ రామారావు మతి స్థిమితం కోల్పోయి ఐదేళ్ల క్రితం సొంత ఊరు కాకినాడ నుంచి వచ్చేశాడు. కొంతకాలంగా జంగారెడ్డిగూడెం రోడ్లపై జీవిస్తూ కాలం గడుపుతున్నాడు. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు చెత్త వాహనంలో వృద్ధుడిని తరలిస్తుండగా స్థానికులు అడ్డుకుని పారిశుద్ధ్య సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి పోలీసుల సహాయంతో అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఈవిషయం పత్రికలతోపాటు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో రామారావు కుటుంబ సభ్యులు అతడిని గుర్తుపట్టారు. కాకినాడలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోరుకొండ రామారావు అన్న కుమారుడు కె.రాజ్‌కుమార్ విషయం తన బాబాయ్‌ను గుర్తుపట్టాడు. సోమవారం జంగారెడ్డిగూడెం వచ్చి ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న తన బాబాయ్‌ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల నుంచి తన బాబాయ్ కనిపించడం లేదని, ఎన్నిచోట్ల వెతికినా ఆచూకీ లక్ష్యం కాలేదని, కరోనాతో చనిపోయి ఉంటాడని భావించామని, రెండు రోజులుగా టీవీల్లో, పేపర్లలో వచ్చిన వార్తలను చూసి సంతోషించి ఇక్కడకు వచ్చామని రాజ్‌కుమార్ తెలిపారు. తన బాబాయ్ ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ చూపిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కె.స్లీవజోజి సమక్షంలో వృద్ధుడు రామారావును అంబులెన్స్‌లో కాకినాడకు తీసుకువెళ్లారు.


ఆస్పత్రిలో వృద్ధుడు బంధువులతో మాట్లాడుతున్న తహసీల్దార్ స్లీవజోజి

ఐఎస్ రాఘవాపురంలో హిజ్రాల అశ్లీల నృత్యాలు

ద్వారకాతిరుమల: గొంతేలమ్మ పండుగ ఊరేగింపులో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తున్న ఇద్దరు హిజ్రాలతో పాటు, మరో ఇద్దరు నిర్వాహకులపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాలు ప్రకారం. ఐఎస్ రాఘవాపురంలో గొంతేలమ్మ ఊరేగింపు సందర్భంగా గ్రామానికి చెందిన మాంద్రు శేఖర్, బిరుదుగడ్డ సత్యన్నారాయణల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంకు చెందిన ఇద్దరు హిజ్రాలు అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తున్నారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ అమీర్ అశ్లీల నృత్య ప్రదర్శనలను అడ్డుకుని, ఇద్దరు హిజ్రాలను, నిర్వాహకులను పోలీస్టేషన్‌కు తరలించారు. అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.

స్పందనలో 13 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడతూ స్పందన కార్యక్రమంలో 13 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఆయా సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు బదిలీ చేస్తామని చెప్పారు. నిర్దేశించిన సమయంలో లోగా వాటిని అధికారులు పరిష్కరిస్తారన్నారు. అధికారులు స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడంతో పాటు వాటి ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆర్డీవో సూచించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

కుకునూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని బంజరగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బంజరగూడెం గ్రామానికి చెందిన ముత్తినేని మునీశ్వరి కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా సోమవారం సాయంత్రం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా, ఇంట్లో ఉన్న గ్యాస్ బండకు మంటలు వ్యాపించి పేలిపోవడంతో ఇల్లు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని బీరువా, డబుల్‌కాట్ మంచం, టీవీ, ఫ్రిడ్జ్ వంటి సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాక రూ. 50 వేలు నగదు, రూ.లక్ష విలువ చేసే బంగారం, ఆధార్, రేషన్‌కార్డు, పిల్లల స్టడీ సర్టిఫికెట్‌లు కాలి బూడిదయ్యాయని బాధిరాలు పేర్కొంది.

కోడి పుంజుల దొంగతనంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: దొరసానిపాడుకు చెందిన లక్కాబత్తుల సిద్ధిరాజు తన పామాయిల్ తోటలో పెంచుతున్న మూడు పందెం కోడి పుంజులను గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 20న రాత్రి దొంగిలించారు. వీటి విలువ రూ. 45 వేలు ఉంటుందని, దొంగిలించిన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బాధితుడు స్థానిక పోలీస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో సోమవారం ఒక పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 6,200 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి


కొయ్యలగూడెంలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు తదితరులు


చింతలపూడిలో నేతాజీ జయంతి వేడుకలలో పాల్గొన్న ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, నాయకులు


జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ సెంటర్‌లో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : భరతమాత ముద్దుబిడ్డలలో అగ్రగణ్యుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖండేల్లి శివ ఆధ్వర్యంలో నిర్వహించిన నేతాజీ 126వ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. గాంధీజీ, నేతాజీల సిద్ధాంతాలు వేరైనా లక్ష్యం మాత్రం భారతావని స్వాతంత్య్రం కోసమేనని బాలరాజు అన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం పలు దేశాలలో పర్యటించి వారి మద్దతును కూడా కట్టడం ద్వారా నేతాజీ ఆంగ్లేయులపై ఒత్తిడి తీసుకురాగలిగారన్నారు. ఆయన అదృశ్యం అయినప్పటికీ భారతీయుల గుండెల్లో నిలిచిన చిరంజీవిగా అభివర్ణించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్, పరింపూడి ఈవో సీహెచ్ సత్యనారాయణ, ఏపీవో కె.నాగేశ్వరరావు, ఆర్ఐ మణిదివ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, నాయకులు ఎస్‌కే బాజీ, సంకు కొండ, గుబ్బల త్రినాద్, ఎం.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

యువత నేతాజీ అడుగుజాడల్లో నడవాలి

చింతలపూడి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలు చింతలపూడి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న నేతాజీ విగ్రహానికి ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, అఖిలభారత ఓబీసీ నాయకులు పీవీ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానకిరెడ్డి కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. అనంతరం అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వీరంకి శ్రీనివాసనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నేతాజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత నేతాజీ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌వీ సత్యన్నారాయణ, ఎస్.సూర్యకుమార్, ఆర్నేపల్లి అప్పారావు, బీసీ నాయకులు పాకా సర్వేశ్వరావు , సొంతి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో ...

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.చక్రధరరావు, ఉపాధ్యాయులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూరేటి శ్రీనివాసరావు, విజయానంద్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోస్ జీవితం ఆదర్శనీయం

జంగారెడ్డిగూడెం : నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై దేశభక్తియుత పోరాటాలు సాగించాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ యువతకు పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకుడు కేవీఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్య్రం ఒకరు ఇచ్చే భిక్ష కాదని, పోరాడి సాధించుకునేదని చెప్పిన నేతాజీలోని దేశభక్తి నేటి సమాజానికి అవసరమన్నారు. జయంతి తప్ప వర్ధంతి లేని ఏకైక స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కటకం బసవయ్య, జర్నలిస్టులు కె.వెంకట్, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, వీహెచ్‌సీ ప్రతినిధులు కురగంటి శ్రీనివాస్, డి.నారాయణ మూర్తి, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, విజయ కుమారి, కవిత, రాజు పాల్గొన్నారు.